క్లుప్తంగా

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

వెల్దుర్తి: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ డి.ప్రసాద్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు జరిగే సర్వసభ్య సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, తాగు నీటి సమస్య, ప్రభుత్వ శాఖల పనితీరు, ఇతర అంశాలపై చర్చించటం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

సిమెంటు లోడు లారీ బోల్తా

డ్రైవర్, క్లీనర్ క్షేమం



కారెంపూడి: మండలంలోని బ్రహ్మనాయుడు కాలనీ సమీపంలో సుద్దగుంతల వద్ద గురువారం సిమెంటు లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయట పడినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే వారు ఘటనా స్థలం నుంచి వెళ్లిపోయారు. శ్రీ చక్ర సిమెంటు ఫ్యాక్టరీ నుంచి లారీ దాచేపల్లి వైపు వెళ్తుండగా గురువారం తెల్లవారుజామున ప్రమాదం జరిగింది. అయితే లారీ బోల్తా పడిన అడుగుల దూరంలోనే భారీ క్వారీ గుంతలున్నాయి. లారీ ఆ గుంతల్లోకి దొర్లి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని ఘటన స్థలాన్ని బట్టి తెలుస్తుంది.

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థినులు



విజయపురిసౌత్: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల విద్యార్థినులు ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో గత నెల 30న అమరావతిలో నిర్వహించిన ఖోఖో పోటీలలో ఆర్ అంజలిబాయి, కె.ఝాన్సి గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మేరిమంజుల గురువారం తెలిపారు. అలాగే ఉమ్మడి అనంతపురం జిల్లా చిగిజర్లలో గత నెల 28 నుంచి 30 వరకు జరిగిన జూడో అండర్–19 పోటీలలో 36 కేజీల విభాగంలో ఎం.పుష్పలత సిల్వర్ మెడల్, 63 కేజీల విభాగంలో కె.ప్రియాంక, 70 కేజీల విభాగంలో ఎం.దీపిక బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. పోటీలలో గెలుపొందిన, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్ మేరి మంజుల, వైస్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, పీడీ మహబూబి, పీఈటీ నసీమ, ఉపాధ్యాయినులు చెంచులక్ష్మి, పుష్పలత అభినందించారు.

డీఎస్పీని సత్కరించిన పోలీస్ సిబ్బంది



గురజాల : డీఎస్పీని పోలీస్ సిబ్బంది గురువారం సత్కరించారు. ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న డీఎస్పీ పల్లపురాజును సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ సేవా పురస్కారం పల్నాడు ప్రాంతానికి రావడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అయ్యప్పలకు చద్ది

గురజాల : వివిధ మాలధారణ చేపట్టిన స్వాములకు చద్ది కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని గోగులపాడు గ్రామంలో వేంచేసియున్న నీలకంఠేశ్వరస్వామి వారి దేవాలయంలో స్వాములకు చద్ది కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ చద్ది కార్యక్రమం 41 రోజులు నిర్వహించడం జరుగుతుందని స్వాములు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్ నంద్యాల రాములమ్మ రామిరెడ్డి, రిక్కల వెంకటేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులు ఆన్‌లైన్ చేయించుకోవాలి

మాచవరం: హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు తమ గ్యాస్ కనెక్షన్లను తప్పనిసరిగా ఆన్‌లైన్ చేయించుకోవాలని శ్రీ హర్ష హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ చిలకా కోటేశ్వరావు గురువారం ప్రకటనలో తెలిపారు. హెచ్‌పీసీఎల్ ఆదేశాల మేరకు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి గ్యాస్ వినియోగ తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. తనిఖీల్లో గ్యాస్ పైప్ కండిషన్, రెగ్యులేటర్ పని విధానం పరిశీలన చేస్తారని తెలిపారు. గ్యాస్ వాడే విధానం, భద్రతపై అవగాహన కల్పిస్తారని, పర్యవేక్షణలో నిర్ణీత రుసుం చెల్లించి, తగు రశీదులు పొంది ఆన్‌లైన్ చేయించుకోవాలని వినియోగదారులను కోరారు.

సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయండి

- సామాజిక న్యాయం వైఎస్సార్ సీపీతోనే సాధ్యం
- సమీక్షించిన ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్‌లు



సమావేశంలో ప్రభుత్వ విప్ పీఆర్కే, పాల్గొన్న నేతలు

మాచర్ల/దుర్గి: రాష్ట్ర అభివృద్ధి సంక్షేమంతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నారని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మూడు జిల్లాల వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మాట్లాడుతూ శుక్రవారం మాచర్ల నియోజకవర్గంలో పర్యటిస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా విచ్చేస్తున్న మంత్రులు, అతిథులకు ఘన స్వాగతం పలకాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సాయంత్రం జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులు, అభిమానులు, సచివాలయ సారథులు, కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ఆయా గ్రామాల నాయకులతో, గురువారం రాత్రి మాచర్ల రింగురోడ్డులో బస్సు యాత్ర సన్నాహక సమావేశం నిర్వహించి తగు సూచనలు చేశారు. సాధికార యాత్రలో భాగంగా రెంటచింతల మండల కేంద్రం నుంచి సాయంత్రం 4 గంటలకు బైకు ర్యాలీతో ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు మాచర్ల పట్టణంలోని గుంటూరు రోడ్డులో గల మహాలక్ష్మి కోల్డ్ స్టోరేజ్ నుంచి పాదయాత్రగా పార్కు సెంటర్‌కు చేరుకుంటారని వివరించారు. పట్టణంలో జరిగే బహిరంగ సభలో వేలాది మంది ప్రజలను భాగస్వామ్యం చేయటంలో ఫ్లెక్సీలు, స్వాగత ఏర్పాట్లలో తమ వంతు కృషి చేయాలని కోరారు. నియోజకవర్గంలో ఆయా వర్గాల ప్రజలతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. రెంటచింతలలోని కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్, జెడ్పీటీసీ సభ్యులు శెట్టిపల్లి యలమంద, వైస్ ఎంపీపీ చల్లా శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షులు కటకం రామారావు, కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయి, యూత్ కన్వీనర్ ఎకటీల బుచ్చిబాబు, మండల జేసీఎస్ కన్వీనర్ బొబ్బ సీతారామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కటకం చిన్న వెంకటయ్య, తోటకూర నాగేశ్వరరావు, పసుపులేటి వెంకటరామయ్య, మాదాసు వెంకటేశ్వర్లు, మద్దికర ఆదిరెడ్డి, నాలి రామయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు. మాచర్లలోని సమీక్ష సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్, బత్తుల ఏడుకొండలు, బోయ రఘురామిరెడ్డి, వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, పట్టణ అధ్యక్షులు పోలా శ్రీను, జేసీఎస్ కన్వీనర్ షేక్ కరిముల్లా, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కొత్తమాసు పాండురంగారావు, డైరెక్టర్లు షేక్ కరిముల్లా, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు కామనబోయిన కోటయ్య, ఉప్పలపాటి జాని, బూదాల మరియమ్మ, అంజి, మాజీ పట్టణ అధ్యక్షులు చుండూరు రోశయ్య, మారం వాసు, మారం ప్రసాద్, నల్ల వెంకటరెడ్డి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి జూలకంటి వీరారెడ్డి, శ్రీనివాస శర్మ, కౌన్సిలర్లు మురళి, బత్తిన వేణు, చందూ గౌడ్, రామిశెట్టి వెంకటేశ్వర్లు, మస్తాన్, ఎంఆర్ఎఫ్ రామాంజనేయ రెడ్డి, గట్ల అరుణ, మాచర్ల సుందరరావు, మందా సంతోష్ తదితరులున్నారు.

సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలి

జెడ్పీ వైస్ చైర్మన్ శౌంటిరెడ్డి



రెంటచింతల: భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ దాదాసాహెబ్ అంబేడ్కర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రను శుక్రవారం రెంటచింతలలో జయప్రదం చేయాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంటిరెడ్డి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా రాష్ట్రంలో సీఎం జగన్ అధికారంలో అధిక ప్రాధాన్యతనిచ్చారన్నారు. బస్సు యాత్రను పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ముందుగా స్థానిక శివాలయంలోని కళ్యాణమండపంలో డిప్యూటీ సీఎం పుష్పశ్రీ వాణి, రాజ్యసభ సభ్యులు వేణుంబాక విజయసాయిరెడ్డిల ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం ఉంటుందన్నారు. అనంతరం సాయంత్రం స్థానిక ప్రధాన రహదారి వెంబడి ఉన్న వైఎస్సార్ కాంశ్య విగ్రహానికి డిప్యూటీ సీఎం పుష్పశ్రీ వాణి, ఎంపీ విజయసాయి రెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పూల మాల వేసి సామాజిక సాధికార యాత్రను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, జిల్లా జేసీఎస్ కో ఆర్డినేటర్ మోర్తల ఉమా మహేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

గిరిజనుల అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

ప్రభుత్వ విప్ పీఆర్కే



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

దుర్గి: రాష్ట్రంలో అన్ని వర్గాలకు ప్రాధాన్యతను కలిస్తూ, గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక విప్లవాత్మక కార్యక్రమాలను చేపట్టారని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని తేరాల గ్రామానికి చెందిన 20 గిరిజన కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పీఆర్కే కండువాలు కప్పి ఆహ్వానించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గోపిదేశీ నాగరాజు, శ్రీను (సింగం శ్రీను) ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో పిట్ట చిన్న అంజయ్య, పిట్ట ముసలయ్య, పెట్టా పెద్ద నాగ రాజు, రామయ్య, దుర్గయ్యతో పాటు వివిధ కుటుంబాలకు చెందిన వారు ఉన్నారు. పీఆర్కే మాట్లాడుతూ గిరిజనుల కోసం ప్రత్యేక యూనివర్సిటీని ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఉప ముఖ్యమంత్రిగా శ్రీవాణిని నియమించి గిరిజన మహిళ నేతకు అరుదైన గౌరవాన్ని కల్పించిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు.

తాగునీటి సమస్యకు చెక్



దాచేపల్లి : మండలంలోని కేసానుపల్లి శివాలయం సెంటర్‌లో గురువారం మంచినీటి కోసం బోరు వేశారు. ఇటీవల గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి మంచినీటి సమస్యను గ్రామస్తులు తీసుకెళ్లారు. తాగునీటి సమస్య పరిష్కరించేందుకు తక్షణమే బోరు వేయించాలని సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావుకి ఎమ్మెల్యే కాసు సూచించారు. దీంతో సర్పంచ్ కోటేశ్వరరావు యుద్ధ ప్రాతిపదికన బోరు వేయించారు. ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డిల ప్రత్యేక పూజల అనంతరం బోరు చేశారు. తాగునీటి సమస్య పరిష్కారం కావటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చెట్టిపాగు ఏసుదాసు, గ్రామ కన్వీనర్ మోమిన్ నాగులమీరా, నాయకులు నెల్లూరి కోటేశ్వరరావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కారెంపూడి: మండలంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ మండల ఏఈ కె.కోటేశ్వరరావు గురువారం సాయంత్రం తెలిపారు. లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోండి

మాచవరం: గ్రామ సభల ద్వారా గుర్తించిన ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని ఎంపీడీఓ యు.బి.వరప్రసాద్ తెలిపారు. మండలంలోని గంగిరెడ్డిపాలెం, మాచవరం గ్రామాల్లో ఉపాధి హామీ గ్రామ సభలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో పనులు గుర్తించి, తుది జాబితాలను తయారు చేయడం జరిగిందన్నారు. పనుల గుర్తింపులో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకటేశ్వర్లు నాయక్, సర్పంచ్ రాగిడి నరేష్, ఎంపీటీసీ సీహెచ్ గురవయ్య, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఓటు హక్కును నమోదు చేసుకోండి

తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి



పిడుగురాళ్ల: ఓటు హక్కు లేని వారు నూతనంగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి గురువారం తన కార్యాలయంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 27వ తేదీన ఓటర్ల జాబితా విడుదల అయిందని, ఈ జాబితాలో ఓటు హక్కు పొందని వారు ఎవరైనా ఉంటే నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో నమోదు చేసుకోవచ్చునని, ఆన్‌లైన్‌లోనైనా నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఫారం 6 ద్వారా నూతన ఓటు, ఫారం 7 ద్వారా తొలగింపులు, ఫారం 8వ ద్వారా అడ్రస్ మార్పులు, చేర్పులు, అక్షర దోషాలకు సంబంధించి నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు బూత్ లెవల్ ఆఫీసర్లతో(బీఎల్‌వోలతో) ఈ నెల 11, 12 తేదీలలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ఆయా బూత్‌ల వద్ద నిర్వహించటం జరుగుతుందని ఆ సమయంలోనూ ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

నూతన అర్బన్ సీఐగా శరత్‌బాబు



పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించిన శరత్‌బాబు

మాచర్ల: అర్బన్ సీఐగా పట్టణానికి నూతనంగా పి.శరత్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరులోని సీపీఎస్ నుంచి ఆయన పట్టణ సీఐగా బదిలీపై వచ్చారు. గతంలో పనిచేసిన టి.బాలకృష్ణ గురజాలకు బదిలీపై వెళ్ళారు. ఆయన స్థానంలో శరత్‌బాబును నియమిస్తూ ఉన్నత స్థాయి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన సీఐగా బాధ్యతలు చేపట్టి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పలు స్టేషన్‌లలో సీఐగా బాధ్యతలు నిర్వహించానని చెప్పారు. పట్టణంలోని ట్రాఫిక్ సమస్య, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, బెట్టింగ్, జూదంతో పాటు అన్నిటిపై నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయనకు మర్యాదపూర్వకంగా ఎస్ఐలు అరుణ, సౌందర రాజన్, రంగారావు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

100 మంది పేదలకు అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న డా. జయప్రకాష్

మాచర్ల: ఇంజనీర్‌గా పనిచేసి పలువురి మన్ననలు పొందిన మాధవశర్మ సేవలు అభినందనీయమని రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లోని వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద 100 మందికి డాక్టర్ విజయ, జయప్రకాష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్టు గోవిందరెడ్డి, ప్రభుత్వాసుపత్రి వైద్యులు జయప్రకాష్ మాట్లాడుతూ మాధవశర్మ స్వర్గస్తులై ఐదు సంవత్సరాలు పూర్తైన సందర్భంగా వర్ధంతి కార్యక్రమంలో భాగంగా అన్నదానాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నరసింహమూర్తి కుటుంబసభ్యులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

నేడు భూములు కోల్పోయే రైతులతో సమావేశం

ముప్పాళ్ళ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 3వ తేదీన కొండమోడు–పేరేచర్ల జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న మాదల, ఇరుకుపాలెం గ్రామాలకు చెందిన రైతులతో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశంలో అవార్డు ఎంక్వయిరీ వినతులు, పరిష్కార మార్గాలపై చర్చించవచ్చన్నారు. సమావేశానికి రైతులు, వారి తరపు ప్రతినిధులు, ఆసక్తిగల వ్యక్తులు, లీగల్ ప్రతినిధులు కూడా పాల్గొనవచ్చన్నారు. సమావేశానికి వచ్చే రైతులు భూములకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు నకలు, భూమి పట్టాదారు పాసుపుస్తకం నకలు, టైటిల్‌డీడ్, ఇతరత్రా ధ్రువపత్రాలు తీసుకొనిరావాలన్నారు. మొత్తం 143 మంది పట్టాదారు రైతులు భూములు కోల్పోతున్నట్లుగా గుర్తించామన్నారు.

ఈ నెల 4వ తేదీ వరకు రైల్వే గేటు మూత



పిడుగురాళ్ల: పట్టణంలోని శ్రీనివాస కాలనీ సమీపంలో ఉన్న రైల్వే గేటు ఈ నెల 4వ తేదీ వరకు తెరవబడదని పిడుగురాళ్ల రైల్వే మాస్టర్ అంజయ్య గురువారం తెలిపారు. పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ నుంచి న్యూ పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ వరకు ఇంజనీరింగ్ వర్క్ జరుగుతుందని, వాహన రాకపోకలు జరిగితే పనులకు అంతరాయం ఏర్పడుతుంది కనుక ఈ నెల 2వ తేదీ నుంచి నెల 4వ తేదీ వరకు రైల్వే గేటును మూసి వేయటం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను ఎన్నుకోవాలని అన్నారు.

బీసీ భవనం నిర్మిస్తాం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



బీసీ భవనం కోసం ఎమ్మెల్యేకు మెమోరాండం అందజేస్తున్న బీసీ నాయకులు

పిడుగురాళ్ల: బీసీల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ఎప్పుడు ముందుంటుందని, అందులో భాగంగానే బీసీల చిరకాల కోరిక బీసీ భవనం త్వరలోనే నిర్మిస్తామని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హామీ ఇచ్చారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ బంగ్లాలో గురువారం పట్టణ బీసీ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి బీసీ భవనం నిర్మించాలని మెమోరాండం అందజేశారు. దానికి స్పందించిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ బీసీల కోరిక మేరకు పిడుగురాళ్ల పట్టణంలో త్వరలోనే బీసీ భవనం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించి సుమారు రూ.40 లక్షలతో భవనం నిర్మిస్తామన్నారు. జ్యోతిరావు పూలే బీసీ భవనంగా నామకరణం చేస్తామని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు పెద్దపీట వేస్తూ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, రాజకీయంగా, నామినేషన్ పదవులను బీసీలకే అందించిన ఘనత ముఖ్యమంత్రిదన్నారు. ఆయన బాటలోనే గురజాల నియోజకవర్గంలో కూడా బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఇప్పటికే జ్యోతిరావు పూలేతోపాటు జాతీయ నాయకుల విగ్రహాల ప్రారంభోత్సవం త్వరలోనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుందుర్తి గురవాచారి, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు కందులూరి శివయ్య, రాష్ట్ర అతిరాస మేర కార్పొరేషన్ డైరెక్టర్ యెనుముల వెంకటేశ్వర్లు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు శెట్టుపల్లి పూర్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు కొక్కెర శ్రీనివాసరావు, బడిగుంతల నాగమణి వెంకటేశ్వర్లు, మండల బీసీ సెల్ అధ్యక్షులు కాగితాల లక్ష్మణరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ నెమకంటి సైదులు, మాజీ ఎంపీపీ గండికోట కోటేశ్వరరావు, ఇల్లూరి వెంకయ్య, దీకొండ రామారావు, కొమెర శ్రీనివాసరావు, సాంబయ్య, చల్లా ఆవులయ్య, బీసీ నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న వెంకటరామిరెడ్డి

కారెంపూడి: స్థానిక లక్ష్మీ చెన్నకేశవ కాలనీ (సుద్ద గుంతలు)లో ప్రధాన రహదారి నిర్మాణానికి మాచర్ల నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి గురువారం సాయంత్రం భూమి పూజ చేశారు. కాలనీ వాసులు, స్థానిక నాయకులు రోడ్డు నిర్మాణం చేయించాలని ప్రభుత్వ విప్, పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి విన్నవించడంతో ఆయన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని త్వరలో పనులు కూడా ప్రారంభం అవుతాయని వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మాచర్లలో శుక్రవారం జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని పార్టీ నాయకుల సమావేశంలో ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అక్బర్, ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, సర్పంచ్ రమావతు ప్రమీలా భాయితేజానాయక్, పట్టణ పార్టీ అధ్యక్షుడు బొమ్మిన అల్లయ్య, సొసైటీ అధ్యక్షుడు కొమ్మిరెడ్డి నల్ల గురువారెడ్డి, మండల పార్టీ కార్యదర్శి పాతూరి రామిరెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, పార్టీ పెద్దలు ఎం శ్రీనివాస శర్మ, టౌన్ వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంఓ రత్నాకర్

మాచవరం: సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, విషజ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి రత్నాకర్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ల్యాబ్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరాల పట్ల చేపట్టాల్సిన వైద్య సేవలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి తెలియజేశారు. జ్వర తీవ్రత ఎక్కువగా ఉంటే, ఉన్నత ఆసుపత్రులకు సిఫారసు చేయాలని సూచించారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. గ్రామ విలేజ్ క్లినిక్‌లో రిపోర్టులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు ప్రసాదరావు, సిబ్బంది హరీష్, శివమ్మ, వీరయ్య, చిన్నారిరోజి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పూర్వీకులను స్మరించుకోవడమే సకల ఆత్మల పండుగ



సమాధుల వద్ద సమిష్టి దివ్యపూజ బలిని సమర్పిస్తున్న ఫాదర్లు



తమ పూర్వీకుల సమాధుల వద్ద స్మరించుకుంటున్న భక్తులు

రెంటచింతల: మృతి చెందిన పూర్వీకులను, ఆత్మీయులను కథోలికులు స్మరించుకోవడమే ఆత్మల పండుగని రెవరెండ్ ఫాదర్ ఏరువ బాలశౌరెడ్డి అన్నారు. గురువారం స్థానిక కానుకమాత చర్చి ఆవరణలో సమాధుల వద్ద విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ ఏరువ లూర్దుమరెడ్డి నేతృత్వంలో ఫాదర్లు అగస్టీన్, పుష్పరాజ్, కన్నా అనీల్, పి.బాలసాగర్, హృదయరాజు, పీటర్ పాపయ్య, కొణతం ఏలీషారాజులతో కలిసి ఆత్మల పండుగ సందర్భంగా సమిష్టి దివ్యబలి పూజను సమర్పించారు. ఈ సందర్భంగా ఫాదర్ ఏరువ బాలశౌరెడ్డి భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి క్రైస్తవ కుటుంబం క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం నవంబర్ 2న తమ పూర్వీకులను భూస్థాపితం చేసిన సమాధులను కొవ్వొత్తులు, రకరకాల పూలతో అలంకరించి వారి ఆత్మలకు నిత్య విశ్రాంతిని ప్రసాదించాలని, దైవలోకం చేరుకోవాలని కోరుతూ దివ్యబలిపూజలో పాల్గొంటారన్నారు. వివిధ ప్రాంతాలలోని క్రైస్తవులందరు ఈ ఆత్మల పండుగ రోజు తమ పూర్వీకులను స్మరించుకుంటారన్నారు. ముందుగా లాటిన్ భాషలో సాంగ్యాలతో సకల పునీతుల ప్రార్థన చేశారు. అనంతరం ఫాదర్లు సమాధులను తీర్థ జలంతో ఆశీర్వదించారు. ఈ సమిష్టి దివ్యపూజా బలిలో చర్చి మఠకన్యలు, చర్చిపెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

స్మార్ట్ విధానంలో బోధన అభినందనీయం

ప్రభుత్వ పాఠ్య పుస్తకాల ట్రస్ట్ డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి

నకరికల్లు: ఉపాధ్యాయులు బోధనా పద్ధతులు మెరుగు పరుచుకుంటే మరింత ఫలితాలు సాధించవచ్చని ప్రభుత్వ పాఠ్య పుస్తకాల ట్రస్ట్ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి సూచించారు. మండలంలోని దేచవరం గ్రామంలోని ఆదర్శ పాఠశాల, చల్లగుండ్ల అడ్డరోడ్డులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను గురువారం సందర్శించారు. 6,7 తరగతుల వారితో కలసి కూర్చొని పాఠాలు విన్నారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఇంగ్లీష్‌లో రీడింగ్ సామర్థ్యం పెంచడంపై పలు సూచనలు చేశారు. పాఠ్య పుస్తకాలలోని సిలబస్ గురించి విద్యార్థులను, ఉపాధ్యాయుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఐఎఫ్‌పీ వినియోగంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్మార్ట్ విధానంలో పాఠ్యాంశాల బోధన తీరును అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో -2 ఎమ్ఎల్ ప్రసాద్, మండల కో ఆర్డినేటర్ బత్తిన మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.